క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం టీటీడీ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు.

నాడు-నేడు పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపల తిమ్మాపురంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం జిల్లా శిక్షణ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు సందర్శించారు. పనులు ఏ మేరకు జరుగుతున్నాయో పరిశీలించారు. అనంతరం పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి.. ఇంగ్లీష్, తెలుగు, గణితంపై పిల్లలను ప్రశ్నించారు. లీడ్, లెసన్ ప్లానింగ్స్, డైరీ, పిల్లల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు.

మారుతీప్రసాద్‌కు అభినందనలు



మారుతీప్రసాద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

మధురవాడ: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులైన వంకాయల మారుతీప్రసాద్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. మధురవాడకు చెందిన మారుతీ ప్రసాద్ గతంలో నగర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులు కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలు శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని తెలిపారు.

ఆర్‌హెచ్ కాలనీలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరింటిని పరిశీలిస్తున్న స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది

పీఎం పాలెం: స్థానిక ఆర్‌హెచ్ కాలనీలో ఓ పూరిల్లు దగ్ధమయింది. బాధితులు రెవెన్యూ సిబ్బందికి తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణరావు అనే పెయింటర్ ఆర్‌హెచ్ కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం ఇంటికి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈఎన్ఎస్ చంద్రరావు బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

ఎల్లారమ్మ జాతరకు ఏర్పాట్లు

తగరపువలస: ఈ నెల 27న జరగనున్న ఎల్లారమ్మ జాతరకు శుక్రవారం ఉత్సవ కేంద్రం వద్ద ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు సొంత నిధులు వెచ్చించి జేసీబీతో ఎల్లారమ్మ పుట్ట వద్ద చదును చేయించారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ జాతర పూజారి ఊశ్ల అప్పారావు, కోనాడ చిన్నా, గంటా చంద్రశేఖర్, విజయకుమార్, రమేష్, ఊశ్ల నరసింగరావు, శీరం సూరిబాబు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలకు మోక్షం



బొమ్మల నుయ్యి ఎదురుగా ప్రమాదకరంగా మారిన గొయ్యి (ఫైల్)



కొత్తగా ఏర్పాటు చేసిన కాలువ



పోలీస్‌స్టేషన్ సమీపంలో కుంగిన ప్రాంతంలో ప్యాచ్‌వర్క్ చేసిన దృశ్యం

భీమునిపట్నం: భీమిలిలోని రెండు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారులు పరిష్కరించారు. ఇక్కడ శివాలయం ఎదురుగా బీచ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఎడమ వైపు బొమ్మల నుయ్యి అని పిలవబడే ఒక బావి ఉంది. దీనికి ఎదురుగా పెద్ద కాలువ ఉంది. దాన్ని పూర్తిగా కప్పకపోవడంతో పెద్ద గొయ్యిలా మారి పాదచారులు, వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఒక బైక్ ఇందులో పడిపోయింది. అదృష్టవశాత్తు దీనిపై ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదిలా ఉండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో మెయిన్ రోడ్డు మీద చాలా రోజుల క్రితం పైప్‌లైన్ ఏర్పాటుకు అధికారులు రోడ్డు తవ్వి దాన్ని సరిగ్గా మూయకుండా వదిలేశారు. దాంతో ఇక్కడ రోడ్డు కుంగిపోయి పాదచారులు, వాహన చోదకులు తిరగడానికి ఇబ్బందిగా మారింది. ఈ రెండు ప్రధాన సమస్యలు చాలా రోజులుగా పరిష్కారం కాలేదు. ఇప్పుడు అధికారులు స్పందించి శివాలయం ఎదురుగా రోడ్డు పక్కన గోతులు కప్పి కొత్త కాలువ ఏర్పాటు చేశారు. అలాగే మెయిన్‌రోడ్డులో కుంగిన ప్రాంతంలో పటిష్టంగా ప్యాచ్‌వర్క్ నిర్వహించారు. దీంతో అవస్థ పడుతున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రధాని ధ్యేయం



రైతులను సన్మానిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి రవిరాజు

పద్మనాభం: రైతుల సంక్షేమమే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ కిసాన్‌మోర్చా ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు అన్నారు. పద్మనాభంలోని మండల బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ వరుసగా నాల్గవ ఏడాది కూడా కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు వేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు గుడివాడ నరిసింహులు, సారిక ప్రకాష్, గెద్ద అప్పలనాయుడులను దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, పీవీవీ ప్రసాద్ పట్నాయక్, పేర్రాజు పాల్గొన్నారు.

వసతి గృహంలో కొనసాగిన సరకుల కొలత

తగరపువలస: బంగ్లామెట్ట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఏఎస్‌డబ్ల్యు పి.సత్యనారాయణ, ఇన్‌చార్జి వార్డెన్ బి.సత్యనారాయణ స్థానిక సచివాలయ సిబ్బంది సమక్షంలో మారోమారు సరకులను తూకం వేసి కొలిచారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇక్కడి వార్డెన్ నాగార్జున లేకుండా గురువారం స్టోర్‌రూమ్‌లో సరకులను తూచిన సంగతి తెలిసిందే. బియ్యాన్ని కిలోల్లో కాకుండా బస్తాల్లో కొలిస్తే సరైన తూకం తేలదని.. అలాంటి సమయంలో తనపై నేరం మోపడం కక్ష సాధింపు కిందకే వస్తుందని నాగార్జున ఆరోపించడంతో ఏఎస్‌డబ్ల్యు, ఇన్‌చార్జి వార్డెన్ బియ్యాన్ని కిలోల్లో కొలవగా 300 కేజీలు వచ్చాయి. ఇదే బియ్యాన్ని గురువారం బస్తాల లెక్కన కొలిచినప్పుడు 350 కిలోలుగా వచ్చింది. ఈ రెండు రోజుల్లో 50 కిలోల వ్యత్యాసం కనిపించింది. ఈ మేరకు అధికారులు రిపోర్టు తయారు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

పీఎం పాలెం : నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ఆధ్యాత్మిక చింతనతో మనశ్శాంతి లభిస్తుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ ఆరో వార్డులోని వాయుపుత్ర లే అవుట్‌లో నిర్మించ తలపెట్టిన ఆదిశక్తి నాగదేవి రామలింగేశ్వర అభయాంజనేయ షిర్డీ సాయి బాబా ఆలయ శంకుస్థాపనలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ నిర్వాహకులు యడ్ల వెంకటరమణరాజు, పోతిన శివ, బాషా, మూర్తిబాబు, భూపతి రాజు కాశీ విశ్వనాథరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకూ తిప్పలు!

- చిట్టివలస పరిధిలో పేరుకుపోతున్న బిల్లులు
- ఏటీపీ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారుల సౌకర్యార్థం బిల్లుల చెల్లింపునకు కూడా తిప్పలు తప్పడం లేదు. కొందరు వినియోగదారులు యూపీఐ యాప్‌లు, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తుండగా.. గ్రామీణులు మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వం, ఏపీఈపీడీసీఎల్ బిల్లుల వసూళ్లకు అవకాశం కల్పించినప్పటికీ చాలా వరకు వినియోగదారులకు అవగాహన లేకుండా పోయింది. బిల్లు గడువు తేదీ తరువాత ప్రైవేట్ మీసేవల్లో అనధికారంగా జరిమానా రూ.వందలలో వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారుల జేబులకు తరచూ చిల్లు పడుతుంది. మధురవాడ విద్యుత్ స్టేషన్‌లో వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్ల కోసం అక్కడ ఎనీటైమ్ పేమెంట్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి అర్బన్‌లో 19వేలు, రూరల్‌లో 13వేలు, భీమిలి విద్యుత్ స్టేషన్ పరిధిలో 20వేలు మొత్తం అన్ని కేటగిరీలో కలిపి 52వేల మందికి పైగా వినియోగదారులు ఉన్నారు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో పేరుకుపోయిన బిల్లుల వసూలు కోసం తాత్కాలికంగా మధురవాడ నుంచి ఓ వ్యక్తిని బిల్లుల వసూళ్లకు మూడు రోజుల పాటు చిట్టివలస కార్యాలయంలో అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికైనా బిల్లుల వసూళ్లకు శాశ్వతంగా ఒక ఉద్యోగిని లేదా ఏటీపీని ఏర్పాటు చేయాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

మజ్జిపేట పాఠశాలల సందర్శన

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఎంఈవో కేపీ బాలామణి సందర్శించారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన 3,4,5 తరగతులను జెడ్పీ హైస్కూల్‌లో విలీనం కావడంతో అక్కడ అందుతున్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సరిపడా బెంచీలు ఉన్నాయా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయుల సాయంతో ప్రణాళికలు వేసుకోవాలన్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. తరువాత నాడు–నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, పాఠ్య ప్రణాళికలు తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రాయడం, చదవడం గమనించారు. నిఘంటువు ఉపయోగాన్ని తెలియజేశారు. సీఆర్పీ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, చిన్నమ్ములు, ఉపాధ్యాయులు వల్లభదాసు బాలాజీ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ జిల్లా అడ్‌హాక్ కమిటీ ఎన్నిక



రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన రాధిక



జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన ఎండీ నూర్జహాన్ బేగం

మధురవాడ: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటైనట్టు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధిక తెలిపారు. మధురవాడకు చెందిన ఈమెకు ఇటీవల విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. ఈ మేరకు జూమ్ మీటింగ్ ద్వారా చర్చించి కమిటీ ఎన్నిక నిర్వహించారని ఆమె తెలిపారు.

జిల్లా కార్యవర్గం సభ్యులు

జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షురాలిగా ఎండీ నూర్జహాన్ బేగం, జనరల్ సెక్రటరీగా ఇ.మాధురి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఒల్లి రమాదేవి, వైస్ ప్రెసిడెంట్‌గా టీవీ శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా ఆకాంక్ష పండా, పి.శిరీష, ఎస్.రామలక్ష్మి, రేష్మ బేగం, ట్రెజరర్‌గా కె.నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రంజిత, జాయింట్ సెక్రటరీలుగా ఆదిలక్ష్మి, బి.రేవతి, పైడితల్లి, నిరుపమ, భవానీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పి.శైలజ, దేవి ప్రియాంక, డి.సల్మా, నూకరత్నం, రాధ, మీనాకుమారి, కె.లీలా ఎన్నికయ్యారు. వీరిని రాష్ట్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత అభినందించారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్-1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్-3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సర్టిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి.ఎన్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్-4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్-5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

అప్పల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం



నీలి మోహన కృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ ఎం.రవికుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40 వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురిచేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

ఏఎన్ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



సుధాకర్‌ను గెలిపించాలని రెడ్డిపల్లి హైస్కూల్లో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాంబాబు తదితరులు



పద్మనాభం హైస్కూల్లో ప్రచారం చేస్తున్న నాయకులు

పద్మనాభం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నిల ప్రచారం నిర్వహించారు. పద్మనాభం, రెడ్డిపల్లి, విజయానందపురం, ఆర్‌వీ పురం, బీఆర్ తాళ్లవలస, పద్మనాభం కస్తూర్బా విద్యాలయాల్లో ఈ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రెడ్డిపల్లి జగదీష్ బాబు, ఆపష్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం, గంగిరెడ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. పద్మనాభం, రేవిడి గ్రామాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు.

సరిహద్దు నిర్ధారణకు సర్వే



సరిహద్దులను సరి చూస్తున్న తహసీల్దార్ రామారావు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ పంచాయతీ, దబ్బందలో టిడ్కో గృహ సముదాయం లే అవుట్‌కు, అర్బన్ హౌసింగ్ లే అవుట్‌కు మధ్య గల సరిహద్దు నిర్ధారణ కోసం శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. దబ్బందలో 36 ఎకరాల్లో టిడ్కో గృహ సముదాయం నిర్మిస్తుండగా దానికి ఆనుకుని 30 ఎకరాల్లో అర్బన్ హౌసింగ్ లే అవుట్ వేశారు. కాగా ఈ రెండు ప్రాజెక్టుల స్థలానికి మధ్యలో సరిహద్దు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీని వలన టిడ్కో ఇళ్ల మురుగు నీటి కాలువలు అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లోకి చొచ్చుకు వచ్చాయి. దీంతో గందరగోళం ఏర్పడింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ లోకవరపు రామారావు, టిడ్కో అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. దీంతో ఎవరి పరిధిలో వారు నిర్మాణ పనులు చేపట్టుకోవడానికి మార్గం సుగమం అయింది.

ఇంటక్ అఖిల భారత కార్యనిర్వాహక కార్యదర్శిగా వరహాలరాజు



కాకర్లపూడి వరహాలరాజు

తగరపువలస: ఇంటక్ అఖిల భారత్ కార్యనిర్వాహక కార్యదర్శిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాకర్లపూడి వరహాలరాజు నియమితులయ్యారు. న్యూఢిల్లీలో ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అధ్యక్షతన జరుగుతున్న 33వ జాతీయ సమావేశాల్లో భాగంగా ఈ నియామకం జరిగింది. చిట్టివలస జ్యూట్‌మిల్లు మూత నేపథ్యంలో కార్మికులకు మెరుగైన నష్టపరిహారం ఇప్పించడంలో వరహాలరాజు కృషి చేశారని.. అలాంటి తమ నాయకుడు మరో మెట్టు ఎక్కుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారని మిల్లు వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి తదితరులు ఆయనను అభినందించారు.

'జేసీఎల్, కోర్టులకు జ్యూట్ యాజమాన్యం తప్పుడు సమాచారం'



చిట్టివలసలో సమావేశమైన జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత సంఘం ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు యాజమాన్యంతో పాటు ఐక్యకార్మిక సంఘాల ప్రతినిధులు జాయింట్ లేబర్ కమిషనర్(జేసీఎల్), న్యాయస్థానాలకు తప్పుడు సమాచారం అందిస్తూ మోసం చేస్తున్నాయని మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు ఆరోపించారు. శుక్రవారం చిట్టివలసలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ తమ సంఘంలోని 500 మంది కార్మికులు ఏళ్ల తరబడి యాజమాన్యంతో న్యాయ పోరాటం చేస్తూ ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు తీసుకోలేదన్నారు. అలాంటిది తాము చెల్లింపులు తీసుకున్నట్టు 2022 డిసెంబరులో జేసీఎల్‌కు ఇచ్చిన జాబితాలో తమ పేర్లు చూసి ఆశ్చర్యపోయామన్నారు. ఈ ఏడాది మార్చిలోగా మిల్లులో కార్మికులు అందరికీ చెల్లింపులు చేస్తామని యాజమాన్యం, ఐక్యకార్మిక సంఘాలు ఇటీవల ప్రకటనలు చేశాయన్నారు. ఈ మేరకు తమ న్యాయవాదులు సమాచార హక్కు చట్టం ప్రకారం జేసీఎల్‌ను సమాచారం కోరగా.. మా 500 మందికి చెల్లింపులు చేసినట్టు సమాచారం ఇచ్చారన్నారు. తాము చెల్లింపులకు దరఖాస్తు చేయకపోయినప్పటికీ రావలసిన బకాయిలు తీసుకున్నట్టు తప్పుడు సమాచారం అందులో ఉందన్నారు. ఇలా జేసీఎల్, న్యాయస్థానాలను మోసం చేసిన యాజమాన్యం, ఐక్యకార్మిక సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జేసీఎల్‌కు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అనంతరం జరిపిన అత్యవసర సమావేశంలో జరిగిన మోసాలపై చర్చించారు. యాజమాన్యం నుంచి చెల్లింపులు తీసుకోని ప్రతి కార్మికుడు కార్యాలయానికి వచ్చి పేర్లు సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నాగోతు అప్పలరాజు, అధ్యక్షుడు వేజెర్ల సూర్య అప్పల నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరావు, కార్మిక ప్రతినిధులు సింగిడి అప్పారావు, దాలయ్యరెడ్డి, పాశల శివ, మాకాల శంకర్, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విద్యలో పురోగతి

పీఎం పాలెం: ప్రణాళికాబద్ధంగా కృషి చేసే విద్యార్థులకే ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడం సులువు అవుతుందని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. స్థానిక సాంకేతిక పాలిటెక్నిక్ వార్షికోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. మరో అతిథి బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బీఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులపై మంచి పట్టు సాధించడానికి ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తుచ తప్పకుండా పాటించాలని హితవు పలికారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్. రాజేంద్ర, ఎగ్జికూటివ్ డైరెక్టర్ రాహుల్, స్థానిక ప్రిన్సిపాల్ ఎ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయిదుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యాంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.